# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-10-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నంలో డేటా కేంద్రం ఏర్పాటుకు ప్రముఖ సాంకేతిక సంస్థ గూగుల్‌తో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ రోజు ఒప్పందం చేసుకోనుంది.**

2. **రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వి. అనిత అధికారులను ఆదేశించారు.**

3. **రైతుకు కనీస మద్దతు ధర అందించాలన్నదే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు పేర్కొన్నారు.**

4. **తెలంగాణా వ్యాప్తంగా 8 వేల 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.**

5. **వినియోగదారురులకు వస్తు ఉత్పత్తులు, సేవల నాణ్యత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

===========================

పారిశ్రామిక, సాంకేతిక రంగాలలో పురోగతి సాధించే దిశగా ప్రముఖ సాంకేతిక సంస్థ గూగుల్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ రోజు ఒప్పందం చేసుకోనుంది. ఈ ఒప్పందం కింద విశాఖపట్నంలో దాదాపు 87 వేల 250 కోట్ల రూపాయల పెట్టుబడితో కూడిన “గూగుల్ ఏ.ఐ. హబ్ “ ఏర్పాటు చేసేందుకు గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ముందుకు వచ్చింది. ఇందుకు సంబంధించి ఈ రోజు డిల్లీలో జరిగే ఒక సమావేశంలో గూగుల్ సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోనున్నది. ఈ ఒప్పంద కార్యక్రమంలో గూగుల్ సంస్థ ప్రతినిధులతో పాటు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తదితరులు పాల్గొననున్నారు.

--------------------------

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో నిన్న సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రధానాంశాలు ప్రస్తావనకు వచ్చాయి. వస్తు సేవల పన్ను- జీఎస్టీ స్లాబుల తగ్గింపు వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ నెల 16వ తేదీన కర్నూలు పట్టణంలో జరగనున్న రోడ్ షోలో పాల్గొనాలని ఈ సందర్భంగా

ఆయన ప్రధాన మంత్రిని ఆహ్వానించారు. వచ్చే నవంబర్‌లో విశాఖపట్నంలో నిర్వహించనున్న పెట్టుబడుల సదస్సు ప్రారంభించాలని కూడా చంద్రబాబు నాయుడు కోరారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా తీర్చి దిద్దే దిశగా  కృషి చేస్తున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని ప్రధాన మంత్రికి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

---------------------------

రహదారి  ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వి. అనిత అధికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రహదారి భద్రతపై సంబంధిత  అధికారులతో హోం మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న ట్రాఫిక్ చలానా వ్యవస్థతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు నిర్వహణ  వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ట్రాఫిక్ నిర్వహణ, నియంత్రణ కోసం కృత్రిమ మేధ వినియోగంపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బారికేడ్లు, ప్రమాద సంకేత సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

---------------------------

రైతుకు కనీస మద్దతు ధర అందించాలన్నదే ఆంధ్రప్రదేశ్  ప్రభుత్వ లక్ష్యమని  భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ చైర్మన్, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు పేర్కొన్నారు. విజయవాడలో జరిగిన భారత ఆహార సంస్థ రాష్ట్ర స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ లావు శ్రీ కృష్ణ దేవరాయలు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

ఆసియాలో 2030 నాటికి ఆకర్షణీయమైన పర్యాటక  రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌ను నిలుపుతామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్ లోని ఉదయ్‌పూర్‌లో ఈ రోజు, రేపు రెండురోజుల పాటు  పర్యాటక గమ్యస్థానాల అభివృద్ధి, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల కల్పన కోసం ఉద్దేశించిన జాతీయ మిషన్‌లో పాల్గొననున్నామని చెప్పారు. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగే ఈ జాతీయ మిషన్ పై చర్చించేందుకు  ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిగా మంత్రి కందుల దుర్గేష్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రతిపాదనలతో పాటు,  పర్యాటక శాఖలో అవలంభిస్తున్న విధానాలు వంటి అంశాలపై ప్రభుత్వం తీసుకోనున్న చర్యలను మంత్రి వివరించనున్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వస్తు సేవల పన్ను-జీఎస్టీ సంస్కరణలతో ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని ఆంధ్రప్రదేశ్ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. "సూపర్ జిఎస్టీ - సూపర్ సేవింగ్స్" ప్రచార కార్యక్రమాలలో భాగంగా కృష్ణా జిల్లా వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన బందర్ బొనాంజా షాపింగ్ ఫెస్టివల్ ను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ,

వాయిస్..32 సెకన్లు

---------------------------

తెలంగాణలో 80 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు. ఈ వానాకాలంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి రానుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల 332 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని.. ధాన్యం కొనుగోలుకు 24 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో ఈ నెల 16న నిర్వహించనున్న సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ప్రధానమంత్రి పర్యటించనున్న నన్నూరు గ్రామం వద్ద జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం టిజీ భరత్ పాత్రికేయులతో మాట్లాడుతూ

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

వినియోగదారురులకు వస్తు ఉత్పత్తులు, సేవల నాణ్యత పట్ల అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచ వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు చట్టబద్ధమైన అధికారాల ద్వారా నిర్దేశించేందుకు 1946లో అక్టోబర్ 14వ తేదీన లండన్‌లో అంతర్జాతీయ ప్రామాణీకరణ సంస్థ ఏర్పాటైంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా అక్టోబర్ 14వ తేదీన ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

వెస్టిండీస్‌తో ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండవ టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ విజయం దిశగా పయనిస్తోంది. ఫాలో ఆన్‌లో భాగంగా రెండవ ఇన్నింగ్స్ ఆరంభించిన వెస్టిండీస్ ఆట నాలుగవ రోజున రెండవ సెషన్‌లో 118.5 ఓవర్లలో 390 పరుగుల వద్ద ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 121 పరుగుల లక్ష్య సాధనకు 18 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. భారత్ విజయానికి ఇంకా 58 పరుగులు చేయాల్సి ఉంది.

---------------------------

కోస్తాంధ్ర ప్రదేశ్, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రానున్న రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ..

..వాయిస్.. 30 సెకన్లు

తెలంగాణలోనూ రెండురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================